క్లుప్తంగా

పరామర్శ


మోహన్‌రెడ్డిని పరామర్శిస్తున్న కేతిరెడ్డి పెద్దారెడ్డి

తాడిపత్రిటౌన్: మండలంలోని ఎగువపల్లిలో మోహన్‌రెడ్డి కుటుంబ సభ్యులను శుక్రవారం తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి పరామర్శించారు. రెండు రోజుల క్రితం మోహన్‌రెడ్డి తండ్రి నాగమునిరెడ్డి మృతి చెందడంతో మాజీ ఎమ్మెల్యే వారి ఇంటికి వెళ్లి సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో కొనుగుంటపల్లి సర్పంచ్ వెంకటరామిరెడ్డి, వెంకటేశ్వరెడ్డి, విశ్వనాథ రెడ్డి, డీలర్ వెంకటరామిరెడ్డి పాల్గొన్నారు.

సేవాగుణం అలవర్చుకోవాలి


దుప్పట్లు పంపిణీ చేస్తున్న గుత్తి కోట సంరక్షణ సమితి సభ్యులు

గుత్తి: ప్రతి ఒక్కరూ సేవాగుణాన్ని అలవర్చుకోవాలని ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎల్లప్ప సూచించారు. గుత్తిలోని ప్రభుత్వాసుపత్రికి శుక్రవారం గుత్తి కోట సంరక్షణ సమితి సభ్యులు 50 దుప్పట్లు వితరణ చేశారు. కార్యక్రమంలో గుత్తి కోట సంరక్షణ సమితి అధ్యక్షులు విజయభాస్కర్, గౌరవ సలహాదారుడు బిల్లేకల్లు రంగనాథ్‌రావు, సభ్యుడు సుధాకర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం పెట్టండి


మాట్లాడుతున్న ఎంఈఓ గురుప్రసాద్

పెద్దవడుగూరు: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న ఎండీఎం సీసీహెచ్‌లు విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలని ఎంఈఓ-2 గురుప్రసాద్ సూచించారు. శుక్రవారం స్థానిక జెడ్పీ పాఠశాలలో మధ్యాహ్న భోజనం పథకం వర్కర్లు, హెల్పర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పాఠశాలల్లో మెనూ ప్రకారం వంటలు వండాలని సూచించారు. భోజనం పెట్టే సమయంలో ఎలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. భోజనం నాణ్యతగా లేకపోయినా, ఎక్కడైనా సమస్యలు తలెత్తినా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. అనంతరం వంటలు ప్రదర్శించి, విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సుధాకర్‌బాబు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

మోడల్ స్కూల్‌లో ఖాళీ సీట్లకు దరఖాస్తుల ఆహ్వానం

పామిడి: పట్టణంలోని మోడల్‌స్కూల్‌లో ఖాళీ సీట్ల భర్తీ కోసం ఆన్‌లైన్ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ అరుణ శుక్రవారం తెలిపారు. 7వ తరగతిలో బీసీ-ఏ 2, ఎస్సీ-1, 9వ తరగతి బీసీ-ఏలో 1 చొప్పున మొత్తం 4 సీట్లు ఖాళీలున్నాయన్నారు. అర్హులైన విద్యార్థులు ఈ నెల 20 వరకూ ఆన్‌లైన్ ప్రక్రియ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. స్థానిక మోడల్ స్కూల్‌లో పై కేటగిరి వైజ్ గల ఖాళీ సీట్లకు ఈ నెల 24న ప్రవేశ పరీక్ష ద్వారా భర్తీ చేస్తామన్నారు. అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రేషన్ సరుకుల అక్రమ రవాణా అరికట్టండి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

తాడిపత్రి రూరల్: తాడిపత్రి ప్రాంతంలో రేషన్ సరుకుల అక్రమ రవాణా అరికట్టాలని తహసీల్దార్ రజాక్‌వలికి శుక్రవారం సీపీఐ నాయకులు వినతిపత్రం అందజేశారు. కూటమి ప్రభుత్వం రేషన్ అక్రమ రవాణాను నియంత్రిస్తామని బీరాలు పలికి, నిందితులకు మద్దతిస్తోందన్నారు. తాడిపత్రి ప్రాంతంలో కొందరు పెద్ద సంఖ్యలో రేషన్ వ్యాపారం చేస్తున్నారన్నారు. పేదల కడుపు కొట్టి నల్లబజారుకు తరలిస్తున్న రేషన్ బియ్యం అక్రమార్కులపై పోలీసు, రెవెన్యూ శాఖ అధికారులు దృష్టి పెట్టాలని వారు కోరారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో పట్టణ కార్యదర్శి చిరంజీవి, సహాయ కార్యదర్శి నాగరంగయ్య, రామాంజి. నాగేంద్ర, రమణ, రత్నమయ్య, అబ్రహం, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

రహదారుణాలు


గుంతలమయమైన తెలికి రహదారి


కంకర తేలిన కొట్టాలపల్లి నుంచి పామిడికి వెళ్లే రహదారి


గుంతలు ఏర్పడిన కొండుపల్లి రహదారి

మండలంలో గ్రామీణ ప్రాంత రహదారులు అధ్వానంగా మారాయి. దీంతో నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ద్విచక్రవాహనదారులు అదుపుతప్పి కిందపడటంతో గాయపడుతున్నారు. పల్లె రోడ్ల రూపురేఖలు మారుస్తామని కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చినా నిలబెట్టుకోలేకపోయిందని వాహనదారులు, ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పాలకులు, అధికారులు స్పందించి రోడ్లు మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

- రోడ్లన్నీ గుంతలమయం
- నరకం చూస్తున్న వాహనదారులు
- పట్టించుకోని పాలకులు, అధికారులు

పెద్దవడుగూరు: రహదారులు గుంతలు తేలడంతో వాహనదారులు, ప్రయాణికులు నరకం చూస్తున్నారు. మండల కేంద్రం నుంచి తెలికి, మేడిమాకులపల్లి, చిన్నవడుగూరు, గుత్తిఅనంతపురం గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారులు అధ్వానంగా మారాయి. దారిలో అక్కడక్కడ ఉన్న చిన్న గుంతలు కంకర తేలి పెద్ద గుంతలుగా ఏర్పడ్డాయి. దీంతో ఆయా గ్రామాలకు వెళ్లాలంటే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక ఆటోల్లో ప్రయాణం చేయాలంటే వృద్ధులు, మహిళలు నరకం చూస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే గ్రామీణ ప్రాంతాలకు రహదారులు వేస్తామని చెప్పినా.. ఇప్పటి వరకూ ఎలాంటి రహదారులు ఏర్పాటు చేయలేదు. కనీసం రోడ్లకు మరమ్మతులు చేయలేని దుస్థితి నెలకొంది. గత ప్రభుత్వం హయాంలో వేసి రహదారుల పనులు తప్ప ఇప్పటి వరకూ ఎలాంటి దారులు వేయలేదని ప్రజలు వాపోతున్నారు. ఆవులాంపల్లి నుంచి జి.వెంకటాంపల్లి మీదుగా జక్కలచెరువు వెళ్లే రహదారి ధ్వంసమైంది. దీంతో రాత్రి సమయాల్లో ఆయా గ్రామాల ప్రజలకు అత్యవసర సమయంలో ప్రయాణం చేయాలంటేనే ఆందోళనకు గురవుతున్నారు. క్రిష్టిపాడు గ్రామం నుంచి కొండుపల్లికి, భీమునిపల్లి నుంచి క్రిష్టిపాడుకు వెళ్లే దారులు కూడా సక్రమంగా లేకపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు అవస్థలు పడుతున్నారు. పి.కొట్టాలపల్లి నుంచి నీలూరు, తంబళ్లపల్లి మీదుగా పామిడి వెళ్లే రహదారి కూడా అధ్వానంగా మారిందని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు చర్యలు తీసుకుని గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే రహదారుల ఏర్పాటుకు కృషి చేయాలని కోరారు.

హామీ విస్మరించారు



కూటమి నాయకులు ఎన్నికల సమయంలో గ్రామీణ ప్రాంతాలకు రహదారుల సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు. అయితే అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రహదారుల మరమ్మతులు పట్టించుకోవడం లేదు. అధికారులు చర్యలు తీసుకుని రహదారుల మరమత్తులు చేయాలి.

– మోహన్‌రెడ్డి మేడిమాకులపల్లి

రోడ్డు అధ్వానం



క్రిష్టిపాడు పంచాయతీలో సమస్యలు అధికంగా ఉన్నాయి. భారీ వాహనాలు తిరగడంతో కొండుపల్లి గ్రామానికి వచ్చే రహదారి రోడ్డు అధ్వానంగా తయారైంది. ఇక్కడ లభిస్తున్న ఖనిజ సంపదను తరలించుకుని సొమ్ము చేసుకుంటారు.. కానీ అభివృద్ధిని మాత్రం గాలికి వదిలేశారు.

– రమణ కొండుపల్లి

అత్యాచారం చేసిన దుండగులను శిక్షించాలి


ఐద్వా ఆధ్వర్యంలో నిరసన తెలుపుతున్న మహిళలు

గుంతకల్లుటౌన్: రామగిరి మండలం ఏడుగుర్రాలపల్లిలో దళిత బాలికపై లైంగిక దాడికి పాల్పడిన దుండగులను కఠినంగా శిక్షించాలని ఐద్వా పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు బి.జ్యోతి, రంగమ్మ డిమాండ్ చేశారు. ఈ ఘటనను వ్యతిరేకిస్తూ శుక్రవారం ఐద్వా ఆధ్వర్యంలో మహిళలు ఆర్టీసీ బస్టాండ్ సర్కిల్‌లో నిరసన తెలిపారు. దళిత వర్గానికి చెందిన మైనర్ బాలికపై కీచకులు ఆరు నెలలుగా అత్యాచారానికి పాల్పడుతూ గర్భవతిని చేశారంటే కూటమి ప్రభుత్వం సిగ్గుతో తలదించుకోవాలన్నారు. ఇంత ఘోరమైన ఘటన జరిగినా పోలీసు వ్యవస్థ ఎందుకు చర్యలు చేపట్టలేదని వారు ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో చిన్నారులు, మహిళలపై అత్యాచారాలు, అఘాయిత్యాలు హెచ్చుమీరుతున్నా కఠిన చర్యలు చేపట్టడంలో ప్రభుత్వం విఫలమైందని వారు మండిపడ్డారు. లైంగిక దాడికి గురైన బాలికకు రక్షణ కల్పించడంతో పాటు ఆ కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐద్వా నాయకురాళ్లు జయమ్మ, షాకీరా, సరస్వతీ, ఆదిలక్ష్మి, చిన్న లక్ష్మి, ప్రభావతి, సాయి, రామలక్ష్మి, హుసేన్‌బీ, నాగమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌ఎంపీలు ప్రథమ చికిత్స మాత్రమే చేయాలి


మాట్లాడుతున్న ఆర్డీఓ శ్రీనివాస్

గుంతకల్లు: ఆర్‌ఎంపీ, పీఎంపీలు కేవలం ప్రథమ చికిత్స మాత్రమే చేయాలని ఆర్డీఓ శ్రీనివాస్ హెచ్చరించారు. శుక్రవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో ఆర్‌ఎంపీలు, పీఎంపీలకు గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షల నిషేధ చట్టంపై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఆర్డీఓ మాట్లాడుతూ ఆర్‌ఎంపీలు, పీఎంపీలు గర్భిణులను పరీక్షించరాదన్నారు. వారిని స్కానింగ్ సెంటర్లకు రెఫర్ చేయకుండా ప్రభుత్వ వైద్యుల వద్దకు పంపాలన్నారు. అంతేకాకుండా ఐదేళ్లలోపు పిల్లలకు ఎటువంటి పరిస్థితుల్లోనూ వైద్య పరీక్షలు, చికిత్స నిర్వహించకూడదన్నారు. జిల్లా ఇమ్యునైజేషన్ ఆఫీసర్ డాక్టర్ యుగంధర్ మాట్లాడుతూ గర్భిణులను లింగ నిర్ధారణకు రెఫర్ చేయకూడదన్నారు. ఒకవేళ లింగనిర్ధారణకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఆర్‌ఎంపీలు, పీఎంపీలు కేవలం ప్రథమ చిక్సితలు మాత్రమే చేయాలని సూది మందులు, సెలైన్లు ఎక్కించకూడదన్నారు. కార్యక్రమంలో ఏఓ భూషణం, పీపీ యూనిట్ డాక్టర్లు అరుణ, హరిత, అర్బన్ హెల్త్ సెంటర్ డాక్టర్లు స్వాతి, సంజీవ, రఘునందన్, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ వేణుగోపాల్, సూపర్‌వైజర్ పద్మలత తదితరులు పాల్గొన్నారు.

'కరోనాపై జాగ్రత్తలు తీసుకోండి'

శింగనమల: కరోనా వైరస్‌పై ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని శింగనమల సీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ రోహిత్ సూచించారు. శుక్రవారం స్థానిక సీహెచ్‌సీలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కరోనా సోకితే దగ్గు, జ్వరం, చలి, తలనొప్పి, ముక్కు కారడం, మూసుకుపోవడం, తుమ్ములు, ఛాతీలో అసౌకర్యం, ఆకలి తగ్గడం, వాంతులు, విరేచనాలు, ఆలసట, కండరాలు, శరీర నొప్పులు రుచి, వాసన కోల్పోడం, బలహీనత, గురక వంటి లక్షణాలు కనిపిస్తాయన్నారు. కరోనాకు శింగనమల సీహెచ్‌సీలోనే వైద్యం అందిస్తామన్నారు. కావల్సిన పరికరాలు అందుబాటులో ఉన్నాయన్నారు.

ఇద్దరికి గాయాలు

గుత్తి: గుత్తి ఆర్‌ఎస్‌లోని పత్తికొండ రోడ్డు ఫ్లైఓవర్ బ్రిడ్జిపై శుక్రవారం ప్రమాదం చోటు చేసుకుని ఇద్దరు గాయపడ్డారు. జొన్నగిరికి చెందిన శ్రీనివాసులు, శ్రీరాములు బైక్‌లో గుత్తికి వస్తుండగా.. బైక్ అదుపు తప్పి బోల్తా పడింది. ప్రమాదంలో గాయపడిన వారిని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

ఆర్టీసీ బస్సును ఢీకొన్న ఆటో

యాడికి: ముందువెళ్తున్న ఆర్టీసీ బస్సును ఆటో ఢీకొనడంతో డ్రైవర్‌కు తృటిలో పెను ప్రమాదం తప్పింది. వివరాలు.. మండలంలోని రాయలచెరువు వద్ద శుక్రవారం మధ్యాహ్నం 1 గంట సమయంలో గుత్తి డిపో నుంచి ఆర్టీసీ బస్సు రాయలచెరువు బస్టాండు మీదుగా తాడిపత్రి వైపు వెళ్తోంది. అదే సమయంలో గుత్తి వైపు నుంచి వచ్చిన ఆటో వెనుక వైపు ఆర్టీసీ బస్సును ఢీ కొంది. ఈ ఘటనలో బస్సు వెనుక భాగం మరమ్మతులకు గురైంది. ఆటో ముందర భాగం పూర్తిగా మరమ్మతులకు గురి కాగా డ్రైవర్‌కు పెను ప్రమాదం తప్పింది.

రస్తా విషయంలో ఘర్షణ

యల్లనూరు: మండలంలోని లింగారెడ్డిపల్లి సమీపంలో తోటలకు వెళ్లే రస్తా విషయంలో లింగారెడ్డిపల్లి దాసరి నారాయణస్వామికి, మల్లాగుండ్ల వారాధికి శుక్రవారం గొడవ జరిగింది. వారిధి తరపున అతని బంధువులు కట్టెలతో దాడిచేయగా రామాంజనేయులు, నారాయణస్వామి, ఓబులేసుకు గాయాలయ్యాయి. నారాయణ స్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ రామాంజనేయ రెడ్డి తెలిపారు.

వైభవంగా ఆలయ ప్రారంభోత్సవం


అలంకరణలో సుంకుల పరమేశ్వరి మాత


పూజలందుకుంటున్న చెన్నకేశవస్వామి

పామిడి: మండలంలోని గజరాంపల్లిలో శుక్రవారం గ్రామస్తుల ఆధ్వర్యంలో సుంకుల పరమేశ్వరి ఆలయ ప్రారంభోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠత భక్తిప్రపత్తులతో వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ చేపట్టారు. అనంతరం మహిళలకు ఒడి బియ్యం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా సర్వ ఏకాదశి పూజలు

పెద్దవడుగూరు: మండల కేంద్రంలోని చెన్నకేశవ స్వామి ఆలయంలో శుక్రవారం సర్వ ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మూలవిరాట్‌ను అర్చకులు ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకొని కాయ కర్పూరాలు సమర్పించారు. తులసి మాల పూజలు, పంచామృతంతో అభిషేకాలు, కుంకుమార్చనలు, ఆకు పూజలు నిర్వహించారు. భగవద్గీత పారాయణం, విష్ణు సహస్రనామ పారాయణం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

గడ్డివాముల దగ్ధం



నగరూరులో దగ్ధమవుతున్న గడ్డివాము, కోమటికుంట్లలో మంటలు అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

యాడికి: మండలంలోని నగరూరు గ్రామ సమీపంలో కమ్మవారిపల్లికి పోయే రహదారిలో ఉన్న గడ్డివాము శుక్రవారం దగ్ధమైంది. బాధిత రైతు నారాయణ స్వామి తెలిపిన వివరాల మేరకు.. నెల క్రితం పశువుల కోసం వరిగడ్డి, జొన్నసొప్ప, వేరుశనగను దాదాపు 10 ట్రాక్టర్ల గడ్డిని రూ.2.5 లక్షల వరకు కొనుగోలు చేశాడు. వేరే గ్రామాల్లో కొనుగోలు చేయడంతో రవాణాకు రూ.50 వేలు ఖర్చయినట్లు బాధిత రైతు వాపోయాడు. అధికారులు స్పందించి ఆదుకోవాలని బాధిత రైతు కోరాడు.

పుట్లూరు: మండలంలోని కోమటికుంట్ల గ్రామంలో శుక్రవారం అగ్నిప్రమాదంలో గడ్డివాములు దగ్ధమయ్యాయి. గ్రామానికి చెందిన రైతు జనార్దనరెడ్డి పాడిపశువుల కోసం నిల్వ ఉంచిన గడ్డి వాములకు మంటలు వ్యాపించడంతో గ్రామస్తులు అగ్నిమాపక అధికారులకు సమాచారం అందించారు. గ్రామానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలు విస్తరించకుండా అదుపు చేశారు.

జవాన్‌కు స్వాగతం


నాగేంద్రబాబును సన్మానిస్తున్న దృశ్యం

గుత్తి: సింధూర్ ఆపరేషన్ తర్వాత జవాన్ నాగేంద్ర బాబు సొంతూరైన గుత్తి ఆర్‌ఎస్‌కు శుక్రవారం వచ్చారు. సమాచారం తెలుసుకున్న జై గౌడ్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్ గౌడ్, పలువురు యువకులు అతడికి ఘన స్వాగతం పలికారు. జవాన్‌కు వీర తిలకం దిద్ది.. పూల మాలలు , శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా జవాన్ సింధూర్ ఆపరేషన్‌పై వివరించారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్


జూదరులను చూపుతున్న పోలీసులు

తాడిపత్రిటౌన్: తాడిపత్రి రూరల్ పరిధిలోని చుక్కలూరు క్రాస్ వద్ద నాపరాళ్ల ఫ్యాక్టరీలో పేకాట ఆడుతున్న 17 మందిని అరెస్టు చేసినట్లు రూరల్ సీఐ శివగంగాధర్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. నిందితుల నుంచి రూ.1.25లక్షలు నగదు, 9 మోటర్ సైకిళ్లు, 17 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తాగునీరు, పారిశుధ్యంపై దృష్టి పెట్టండి


కౌన్సిల్ సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే

తాడిపత్రి రూరల్: మునిసిపాలిటీ పరిధిలో తాగునీరు, పారిశుధ్యంపై అధికారులు దృష్టి పెట్టాలని ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి ఆదేశించారు. మునిసిపల్ కార్యాలయంలో శుక్రవారం వైస్ చైర్మన్ అరుణ ఆధ్వర్యంలో కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఎక్స్ అఫిషియో మెంబర్‌గా ఎమ్మెల్యే హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ పట్టణంలోని పలు చోట్ల పారిశుధ్యం సరిగా లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అండర్ డ్రైనేజీ నిర్వహణ కోసం పైపుల కొనుగోలు కోసం రూ.1.72 లక్షలను మంజూరు చేస్తూ కౌన్సిల్ ఆమోదించింది. పట్టణంలోని ఆర్వో ప్లాంట్ల మరమ్మతులు, కొత్త యంత్రాల ఏర్పాటు కోసం రూ.12.52 లక్షలు మంజూరు చేస్తూ కౌన్సిల్ సభ్యులు ఆమోదం తెలిపారు. పెన్నానది నుంచి బుగ్గ వాటర్ వర్క్స్, నెహ్రూ పార్కులోని ఈఎల్‌ఎస్‌ఆర్ వరకూ హెచ్‌డీపీఈ పైపులైన్ కోసం రూ.13.29 లక్షల మంజూరు చేస్తూ తీర్మానించారు. అలాగే పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేస్తూ సభ్యులు ఆమోదం తెలిపారు. మునిసిపాలిటీకి సంబంధించి సివిల్, క్రిమినల్ కేసులను వాదించడానికి న్యాయవాదులు మాధవి, హనీఫ్‌బాషాను మునిసిపల్ స్టాండింగ్ కౌన్సిల్ సభ్యులుగా ఎంపిక చేస్తూ తీర్మానం చేశారు.

ఘనంగా చంద్ర రాజేశ్వరరావు జయంతి

గుంతకల్లు: స్థానిక సీపీఐ కార్యాలయంలో శుక్రవారం చంద్ర రాజేశ్వరరావు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు గోవిందు, వీరభద్రస్వామి, మహేష్, గోపీనాథ్, ఎస్‌ఎండీ గౌస్, రాము, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించండి

పామిడి: పట్టణంలోని గుండప్పరావు కాలనీలో విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని కాలనీవాసులు టీచర్లు సూర్య నాగిరెడ్డి, నక్కా రామ్మోహన్, జనార్దన్‌రెడ్డి శుక్రవారం కోరారు. కాలనీకి సరఫరా చేసే కరెంటు వైరు గాలులకు తరుచూ తెగిపోతోందన్నారు. దీనికితోడు అధికలోడ్ పడితే కరెంటువైరు కట్ అవుతోందన్నారు. ఈ విధంగా నెలకు మూడు, నాలుగు సార్లు కరెంటు వైరు తెగిపోతుండడంతో తీవ్ర విద్యుత్ అంతరాయం ఏర్పడుతోందన్నారు. ఒక్కోసారి రెండు రోజుల వరకూ కరెంటు రాక అంధకారంలో ఉంటున్నామన్నారు. దీంతో రాత్రి వేళ కరెంట్ కోతతో చిన్నపిల్లలు, వృద్ధులు అవస్థలు పడుతున్నారన్నారు. సమస్యపై పలుమార్లు విద్యుత్‌శాఖ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని వాపోయారు. సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి నూతన వైరు ఏర్పాటు చేసి విద్యుత్ సమస్య లేకుండా చూడాలని వారు కోరారు.

బక్రీద్ శుభాకాంక్షలు




వై.వెంకటరామిరెడ్డి, కేతిరెడ్డి పెద్దారెడ్డి, శైలజానాథ్

గుంతకల్లుటౌన్/తాడిపత్రిటౌన్/శింగనమల: గుంతకల్లు, తాడిపత్రి, శింగనమల నియోజకవర్గంలోని ముస్లింలందరికీ మాజీ ఎమ్మెల్యేలు, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్తలు వై.వెంకటరామిరెడ్డి, కేతిరెడ్డి పెద్దారెడ్డి, సాకే శైలజానాథ్ బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు శక్రవారం వారు వేర్వేరు ప్రకటనలు విడుదల చేశారు. మానవాళిని జాగృత పరిచి, త్యాగనిరతిని చాటి చెప్పే అతి పవిత్రమైన పండుగను శనివారం ముస్లింలు సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షిస్తున్నామన్నారు.

స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి


తాడిపత్రి రోడ్డులో రాస్తారోకో చేస్తున్న దృశ్యం

గుత్తి: పట్టణంలోని తాడిపత్రి రోడ్డులో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని బుడబుక్కల, జంగాల కాలనీవాసులు శుక్రవారం రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా ఆందోళన కారులు మాట్లాడుతూ స్పీడ్ బ్రేకర్లు లేకపోవడం వల్ల తరుచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. గత గురువారం కార్తీక్ అనే యువకుడు లారీ కింద పడి మృతి చెందాడన్నారు. ఇలాంటి ఘటనలు ఇప్పటికే అనేకం చోటు చేసుకున్నాయన్నారు. అధికారులు స్పందించి స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రాస్తారోకో చేయడం వల్ల ట్రాఫిక్ స్తంభించి వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తాయి. సీఐ వెంకటేశ్వర్లు స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయిస్తామని హామీ ఇవ్వడం రాస్తారోకో విరమించారు.

అందుబాటులో ఎరువులు

శింగనమల: శింగనమల వ్యవసాయ సహకార సంఘం (సింగిల్ విండో)లో రైతులకు రసాయనిక ఎరువులు విక్రయిస్తున్నట్లు రైతులు సద్వినియోగం చేసుకోవాలని సీఈఓ నారాయణస్వామి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ యూరియా రూ.228, డీఏపీ(20.20.0.13) రూ.1300, పొటాష్ వైట్ రూ.1,550కు 50 కేజీల బస్తాను విక్రయిస్తామన్నారు. కావాల్సిన రైతులు పట్టాదారు పాసు పుస్తకం తీసుకురావాలన్నారు.

ఉపకార వేతనానికి ఎంపిక



లక్ష్మీపతి, మహబూబ్‌బేషాహిద్

యాడికి: మండలంలోని మోడల్ స్కూల్‌కు చెందిన ఇద్దరు విద్యార్థులు జాతీయ ఉపకార వేతనానికి ఎంపికైనట్లు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ మారుతి శుక్రవారం తెలిపారు. 2024-25లో జరిగిన ఉపకార వేతనం అర్హత పరీక్షలో పాల్గొన్న విద్యార్థులు లక్ష్మీపతి (95 మార్కులు), మహబూబ్ బే షాహిద్(91 మార్కులు) ప్రతిభ చూపారన్నారు. వీరికి సంవత్సరానికి రూ.12 వేల చొప్పున నాలుగు సంవత్సరాల పాటు జాతీయ విద్యా మంత్రిత్వ శాఖ అందిస్తుందన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ఎంపికైన విద్యార్థులను అభినందించారు.

బాల్య వివాహాలు నేరం

గార్లదిన్నె: బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని ఐసీడీఎస్ సీడీపీఓ ఉమాశంకరమ్మ అన్నారు. శుక్రవారం గార్లదిన్నె అంగన్‌వాడీ కేంద్రంలో కిశోరి వికాసం వేసవి శిక్షణ కార్యక్రమంలో భాగంగా లింగ వివక్షత, అసమానతలపై కిశోర బాలికలు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ ఆడ పిల్లల పట్ల లింగ వివక్ష వీడాలన్నారు. ఆడపిల్లలు ఆరోగ్యంపై దృష్టి పెట్టాలన్నారు.అనంతరం బాల్య వివాహాలు వల్ల జరిగే అనర్థాలు, వృత్తి, విద్య, పోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మహిళా పోలీస్ మనస్విని, అంగన్‌వాడీ కార్యకర్తలు జుబేదా, అన్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

అదనపు వసతుల భవనానికి భూమి పూజ

యల్లనూరు: మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో (జూనియర్ కాలేజ్) రెసిడెన్సియల్ కళాశాలలో అదనపు వసతుల భవన నిర్మాణాలకు శుక్రవారం శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి భూమి పూజ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏపీఎస్ఎస్ నిధులు రూ.1.60 కోట్లతో పనులు ప్రారంభించామన్నారు. కార్యక్రమంలో సమగ్రశిక్ష ఇంజినీరు జయరాం, తహసీల్దారు శేషారెడ్డి, సీఐ సత్యబాబు, ఎస్ఐ రామాంజనేయరెడ్డి, ఎంపీడీఓ వాసుదేవరెడ్డి, ఎంఈఓలు చంద్రశేఖర్, పరమేశ్వర్‌రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.